క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కొలువుదీర్చి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

లీజు హక్కులకు వేలం పాటల నిర్వహణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో వ్యాపారాలకు లీజు హక్కులు ఇచ్చేందుకు శుక్రవారం బహిరంగవేలం పాటలు నిర్వహించారు. కొండపై కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయానికి నిర్వహించిన వేలం పాట సంవత్సర కాలపరిమితికి రూ. 63 లక్షల హెచ్చు మొత్తానికి వెళ్లింది. అలాగే గంగసాని అగ్రహారంలో ఫలసాయం తోటల నుంచి ఈసారి ఫలసాయం తీసుకునే హక్కు రూ. లక్ష 13 వేలకు, బాలాజీనగర్‌లో ఉన్న తోటల్లో ఫలసాయం తీసుకునేందుకు రూ. 70 వేలు హెచ్చు మొత్తానికి పాటలు వెళ్లాయి. ఏఈవో ఆనంద్‌కుమార్ తదితరులు వేలం పాటలు నిర్వహించారు.

మండలంలో రెండు ఇంటర్ పరీక్షా కేంద్రాలు

సబ్బవరం: మండలంలో రెండు ఇంటర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ పి. శుభాషిణి, ఎస్. రామకృష్ణ తెలిపారు. సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక పరీక్షా కేంద్రం, గురుకుల పాఠశాలలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, అత్యవసర వైద్య సేవలు, ఫ్యాన్లు, బెంచీలు, లైట్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందన్నారు. గురుకుల పాఠశాలలో మొదటి ఇంటర్ విద్యార్థులు 278, ద్వితీయ ఇంటర్ విద్యార్థులు 231 మంది పరీక్షలు రాస్తారన్నారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు.

భైరవస్వామికి విశేషంగా పూజలు

సింహాచలం: అమావాస్యని పురస్కరించుకుని భైరవవాకలోని భైరవస్వామికి శుక్రవారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి స్వామికి అమృత కలశాలు సమర్పించారు. విభూదితో అభిషేకాలు నిర్వహించారు. భక్తులతో ఆలయానికి వెళ్లే రెండు కిలోమీటర్ల మార్గం కిటకిటలాడింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

సబ్బవరం:మండలంలోని అమృతపురం శివారు చింతగట్లలో గురువారం రాత్రి పేకాట స్థావరాలపై దాడులు చేసి ముగ్గురు పేకాటరాయుళ్లను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. పేకాటరాయుళ్ల వద్ద నుంచి రూ.2,080 నగదు స్వాధీనం చేసుకోన్నామని హెచ్‌సీ డి. శ్రీనివాసరావు తెలిపారు. పటుబడినవారిలో విశాఖకు చెందిన దాసరి బాబూరావు(36), రాపర్తి గంగరాజు (30), చింతగట్లకు చెందిన మునక రాంబాబు(35)ను శుక్రవారం అనకాపల్లి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

నేడు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: కడియం-ద్వారపూడి-అనపర్తి సెక్షన్ మధ్య ఆధునికీకరణ పనులు జరుగుతున్న కారణంగా ఆయా తేదీల్లో పలు రైళ్లు రద్దు చేశారు. ఈ నెల 1, 2వ తేదీల్లో గుంటూరు-విశాఖపట్నం(12739) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 2,3వ తేదీల్లో విశాఖపట్నం-గుంటూరు(12740)సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 2న ఇరువైపులా విశాఖపట్నం-గుంటూరు-విశాఖపట్నం (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, 3న లింగంపల్లి-విశాఖపట్నం(12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఏఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సంధ్యాదేవి



దాబాగార్డెన్స్: ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి.ఎస్.ఎం సంధ్యాదేవిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ ఓబీజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ గరుడ బుచ్చిరాజు ఉద్యోగ విరమణ చేయడంతో.. ఆయన స్థానంలో సంధ్యాదేవిని నియమించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సబ్బవరం:మండలంలోని పెదనాయుడుపాలెం శివారు గణపతినగరంలో కొలువుదీరిన శ్రీగణపతి భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామివారి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్ దర్శించుకున్నారు. సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ సబ్బవరపు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన ఆవిష్కరణలు

లేజర్ సెక్యూరిటీ అలారం



అనుమతి లేని వ్యక్తి ఓ నిర్దిష్ట స్థలాన్ని దాటి వెళ్లినప్పుడు అలారం మోగించే లేజర్ ఆధారిత భద్రతా పరికరాల నమూనా

ఆటోమెటిక్ స్ట్రీట్ లైట్స్



చీకటి పెరిగినప్పుడు లైట్లు స్వయం చాలకంగా వెలిగి, వెలుగు పెరిగినప్పుడు ఆఫ్ అయ్యే శక్తి సంరక్షణ విధాన వ్యవస్థ ప్రాజెక్ట్

వర్షపు నీటిని గుర్తించే పరికరం



వర్షాన్ని గుర్తించి నీటి సంరక్షణ విధానాలతో అనుసంధానం చేయగల సెన్సార్ ఆధారిత వ్యవస్థకు సంబంధించిన నమూనా

గ్రౌండ్ వాటర్ సోర్స్‌తో ఎగ్జాస్ట్ ఫ్యాన్



భూ గర్భ జలాలను ఉపయోగించి గాలిని చల్లగా మార్చే ప్రత్యేకమైన వెంటిలేషన్ వ్యవస్థతో రూపొందించిన మోడల్

- పాలిటెక్నిక్ కళాశాలలో ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

పెందుర్తి: సృజనాత్మకతకు పదును పెట్టి విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. వారి ప్రతిభకు దర్పణం పడుతూ రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. చంద్రశేఖర్ ప్రాజెక్టులను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు.

- **ఎలక్ట్రికల్ బెల్:** సులభంగా అమర్చుకునే తక్కువ వ్యయంతో కూడిన విద్యుత్ డోర్‌బెల్ వ్యవస్థ.
- **మోషన్ డిటెక్టర్:** చోరీలు నివారించడానికి మానవ చలనాన్ని గుర్తించి అలారం లేదా లైట్లు ఆన్ చేసే భద్రతా వ్యవస్థ
- **ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ :** అగ్ని ప్రమాదాన్ని గుర్తించి, స్వయం చాలకంగా అగ్నిని అదుపు చేసే స్మార్ట్ సిస్టమ్ వ్యవస్థ
- **నీటి స్థాయి సూచిక :** నీటి నిల్వలను సమర్థవంతంగా నిర్వహించడానికి నీటిస్థాయిని పర్యవేక్షించే పరికరం. ఆకట్టుకున్నాయి.

రవీంద్రభారతిలో..



సుజాతనగర్‌లోని రవీంద్రభారతిలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతి పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డీఆర్‌డీవో కేటగిరి-ఎఫ్ శాస్త్రవేత్త కోట శ్రీకాంత్, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి వెంకటేశ్, డీఎం కె.రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ్‌లో..

కళాశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో ఆలోచింపజేసింది. విద్యార్థులు 33 రకాల ప్రాజెక్టలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన దంత వైద్య శిబిరంలో 130 మందికి వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్.ఈ ఫ్లోరా తదితరులు పాల్గొన్నారు.

మానవ ప్రగతికి సైన్స్ మూలం



ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ప్రదర్శన

సబ్బవరం: సైన్స్ మానవ ప్రగతికి మూలాధారమని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. స్థానిక సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

- గుల్లేపల్లి అక్షర ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ఫేర్‌ను ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ బి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడచీపురుపల్లి పాఠశాలలో..

పరవాడ: వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు ప్రారంభించారు. విద్యార్థుల ప్రాజెక్టులు పరిశీలించి, ఉత్తమ ప్రదర్శనకు బహుమతి అందించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో విద్యార్థుల ప్రాజెక్టులను ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి పరిశీలించి, అభినందించారు.



గుల్లేపల్లి అక్షర స్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న ఎంఈవో లక్షణరావు



వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం కనకేశ్వరరావు

ఉపాధి కూలీల వేతనం చెల్లించాలి

పరవాడ: ఉపాధిహామీ కూలీలకు చెల్లించాల్సిన ఆరు వారాల బకాయి వేతనాన్ని వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిసెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తానాం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలకు చేసిన పనులకు ప్రతి వారం వేతనం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో కూలీలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు అప్పారావు, నాయుడు, పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా తిరువీధి



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు, వేద పండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. స్వామివారికి విశేష పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

- 102 యూనిట్ల రక్తం సేకరణ
- అవయవదానానికి 30 మంది రిజిస్ట్రేషన్
- 300 మందికి నేత్ర, దంత, క్యాన్సర్ పరీక్షలు



రక్తదానం చేస్తున్న దాతలు

పెందుర్తి: పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నాలుగు రోడ్ల కూడలి వద్ద నిర్వహించిన మెగా వైద్య, రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి నేత్ర, దంత, సాధారణ వైద్య పరీక్షలతో పాటు క్యాన్సర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. రక్తదాన శిబిరంలో 102 మంది దాతలు రక్తదానం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో 30 మంది అవయవదానం చేసేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పెందుర్తి సీఐ కె.వి సతీష్‌కుమార్ చేతుల మీదుగా రక్తదాతలకు, అవయవదానం కోసం రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్, లయోలా వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు దొడ్డి ప్రకాష్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దాడి ఉమామహేశ్వరరావు, ట్రస్ట్ నిర్వాహకులు, మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి, మెడికవర్ ఆసుపత్రి, పుష్పగిరి కంటి ఆసుపత్రి, అనీల్ నీరుకొండ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, సంఘమిత్ర కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

గంజాయి కలిగిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి కలిగిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాదరావు తెలిపిన వివరాలివి.. నిందితుడు బోలెం కన్నబాబు టూ టౌన్ పీఎస్ పరిధిలోని ఎస్.వి.పి నగర్, కొబ్బరితోటలో నివాసం ఉంటున్నా డు. 2013 డిసెంబర్ 20న అప్పటి టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ వై.గోవింద రావు తనిఖీ చేస్తున్న సమయంలో నిందితుడు కన్నబాబు నుంచి రెండు గోనె సంచులతో 13.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి నేరాభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

అనుమతులు లేకుండా ఔషధాల విక్రయం

- ఒకరికి ఆరు నెలల జైలు

విశాఖ లీగల్: అనుమతి లేకుండా మందుల దుకాణం నిర్వహించిన వ్యక్తికి ఆరు నెలలు జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తూ నగరంలోని రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సి.కె.గాయత్రి దేవి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కం జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు తెలిపిన వివరాలివి.. నగరంలోని నందగిరినగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా మద్దాల సత్యనారాయణ ఔషధాలు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు 2013 జూన్ 14న ఔషధ తనిఖీ అధికారులు ఆర్.లలిత, కె.రజిత, ఎ.టి.వి.రమాదేవి ఈ దుకాణాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఎటువంటి లైసెన్స్‌లు లేకుండా కొన్ని మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతనిపై ఔషధ విక్రయ నిషేధ చట్టం సెక్షన్ 23(5)(బి) కింద కేసు నమోదు చేశారు. నిందితుడి నుంచి ఐదు రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

గాయపరిచిన వ్యక్తికి రెండేళ్ల జైలు

విశాఖలీగల్: స్వల్ప వివాదంలో ఒక వ్యక్తిని తీవ్రంగా కత్తితో గాయపరిచిన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష శిక్ష విధిస్తూ నగరంలోని రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సి.కె గాయత్రి దేవి తీర్పునిచ్చారు. ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కం జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలివి.. ఫిర్యాది నగరంలోని కైలాసపురం శాంతినగర్ ప్రాంతానికి చెందిన పూడి సత్యనారాయణ. ఆయన విశాఖ పోర్టు ట్రస్ట్‌లో పనిచేసే వాడు. నిందితుడు రౌతు సతీష్ కూడా అదే ప్రాంతంలో ఉంటున్నాడు. 2017 ఏప్రిల్ 25న సాయంత్రం నిందితుడు మద్యం సేవించి పూడి సత్యనారాయణ ఇంటికి వచ్చి గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. తదనంతరం రౌతు సతీష్ కత్తితో సత్యనారాయణపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. ఫిర్యాది వెంటనే తన కుటుంబ సభ్యుల సహాయంతో సమీపంలోని పోర్టు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

అధ్యాపక వృత్తికే వన్నె తెచ్చారు



సత్యారావును సత్కరిస్తున్న సమన్వయాధికారి ప్రభావతి, ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

సబ్బవరం: గణిత శాస్త్ర అధ్యాపకునిగా సీహెచ్‌వీవీ సత్యారావు ఎంతో నిబద్ధతతో పని చేసి, వృత్తికే వన్నె తెచ్చారని జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయాధికారి ప్రభావతి కొనియాడారు. సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సత్యారావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1990లో పీజీటీగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన సత్యారావు 1997లో జేఎల్‌గా పదోన్నతి పొంది ఎంతో నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తించారన్నారు. దేవరాపల్లి, సబ్బవరం గురుకులాలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఆయన అందించిన సేవలు అధికారుల మన్ననలు పొందాయన్నారు. సన్మానగ్రహీత సత్యారావు మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా గురుకుల పాఠశాలల్లో అందించిన సేవలు సంతృప్తినిచ్చాయన్నారు. తనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎట్టకేలకు పూర్వ డీఆర్‌ఎంకు బెయిల్

- సొంత పూచీకత్తుతో బెయిల్ ఇచ్చిన సీబీఐ స్పెషల్ కోర్టు



సౌరభ్‌కుమార్ ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: టెండర్లకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన వాల్తేరు రైల్వే పూర్వ డీఆర్‌ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్‌కు ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. గతేడాది నవంబర్‌లో ముంబయిలో ఓ కాంట్రాక్ట్ సంస్థకు చెందిన వ్యాపారుల నుంచి లంచం తీసుకుంటూ సౌరభ్‌కుమార్ దొరికిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సీబీఐ జైలులోనే సౌరభ్‌కుమార్ ఉన్నారు. హిందూస్థాన్ ఫైబర్ గ్లాస్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి రూ.3.17 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే పనులు ఆలస్యంగా చేయడంతో రైల్వే బోర్డు భారీ జరిమానా విధించింది. ఈ నేపథ్యంలో బిల్లులు క్లియరెన్స్‌తో పాటు జరిమానా తగ్గించేందుకు సౌరభ్‌కుమార్ రూ.30 లక్షల లంచం అడిగినట్లు సీబీఐ విచారణలో వెల్లడైంది. చివరికి రూ.25 లక్షలు ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించడంతో పుణెలో లంచం తీసుకుంటూ కేంద్ర దర్యాప్తు సంస్థకు రెడ్ హ్యాండెడ్‌గా సౌరభ్‌కుమార్ దొరికిపోయారు. పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా సీబీఐ ప్రత్యేక కోర్టు(ముంబయి) తిరస్కరించింది. చివరికి సొంత పూచీకత్తుతో శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. సౌరభ్‌కుమార్ నేరాలకు సంబంధించిన పూర్తి ఆధారాలను సీబీఐ అధికారులు కోర్టుకు సమర్పించారు. నిందితుడు ఇప్పటికే సస్పెండ్ అయ్యారని తెలిపారు. సాక్షుల వాంగ్మూలాలు కూడా తీసుకున్న నేపథ్యంలో.. సాక్ష్యాలు, రికార్డులు తారుమారు చేసే అవకాశం లేదని సీబీఐ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి అమిత్ ఖర్కర్ అన్నారు. నేరారోపణ నిరూపితమైతే సౌరభ్‌కుమార్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉన్నందున.. శిక్ష తీవ్రతను పరిగణలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు.

'పది' పరీక్షల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగస్వాములయ్యే అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జ్ఞానాపురంలో సిల్వర్ జూబ్లీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పరీక్షల విధులు కేటాయించిన అధికారులతో శుక్రవారం జరిగిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను తీసుకుని వెళ్లకూడదన్నారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటిస్తూ ఎక్కడికక్కడ నోటీసులు అతికించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, దగ్గరలోని జిరాక్స్ షాపులను మూసి వేయించాలన్నారు. పరీక్ష ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరచడం, అక్కడ నుంచి కేంద్రాలకు తీసుకు వస్తున్నప్పుడు, తిరిగి పోస్టాఫీసుకు పంపించేటప్పుడు ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ప్రతిక్షణం అప్రమత్తతతో ఉంటూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రాంతీయ విద్యాసంచాలకుడు బి.విజయభాస్కర్, డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణ కుమార్, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.